కంటి వెలుగుకు దూరం

కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై గురించి పట్టించుకోవడం లేదు. ఆస్పత్రుల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. అత్యసవర, ఆపరేషన్లకు వినియోగించే మందులు సైతం ఉండడం లేదు. తద్వారా ఆస్పత్రులను నిర్వీర్యం చేస్తోంది. గూడూరు ఏరియా ఆస్పత్రిలో మందుల కొరత కారణంగా రెండు నెలలుగా కంటి ఆపరేషన్లు చేయడం లేదు. వైద్యులు కంటి పరీక్షలకే పరిమితం అవుతున్నారు. ఆపరేషన్ల కోసం ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. గత ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం వినూత్న పథకాలు అమలుచేసిందని, కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- కంటి పరీక్షలకే పరిమితం
- మందుల కొరత
- రెండు నెలలుగా ఆగిన శస్త్ర చికిత్సలు
- ఇదీ గూడూరు ఏరియా ఆస్పత్రి పరిస్థితి


కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్టు


తాళాలు వేసి ఉన్న కంటి రోగులు ఉండే గది

చిల్లకూరు : గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాలతో పాటు, రాపూరు ప్రాంతాలకు చెందిన పేదలు కంటి శస్త్ర చికిత్సలకు గూడూరు ఏరియా ఆస్పత్రికి వస్తుంటారు. ఇక్కడికి ప్రతి రోజూ కనీసం 40 మందికి తగ్గకుండా కంటి పరీక్షలు చేయించుకునేందుకు వస్తుంటారు. వారిలో పది మందికి పైగా శస్త్ర చికిత్సకు ఎంపిక వుతుంటారు. ఇక్కడ మందులు లేకపోవడంతో రెండు నెలలుగా శస్త్ర చికిత్సలు చేయడం లేదు. రోగులకు ఆపరేషన్లు చేస్తామని చెప్పడమే తప్ప ఎప్పుడు చేస్తారనే విషయాన్ని కచ్చితంగా చెప్పడం లేదు. మందుల కొరత ఉందని, ఏప్రిల్‌లో శస్త్రచికిత్స చేస్తామని చెబుతూ కాలం వెల్లదీస్తున్నారు. గత ఏడాది ఫిబ్రవరి, మార్చిలో ఒక కంటికి శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి ఈ ఏడాది అదే నెలలో మరో కంటికి శస్త్ర చికిత్స చేస్తామని వైద్యులు చెప్పారు. వారు ప్రస్తుతం ఆస్పత్రికి వచ్చి ఉసూరుమని వెనక్కి వెళ్లిపోతున్నారు. కొంత ఆర్థిక స్థోమత వున్న వారు ఇతర ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్స చేసుకుంటున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లలేని పేదలు, దీంతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రత్యేక సెలైన్ కూడా లేని దుస్థితి

కంటి శస్త్ర చికిత్సలు చేసే సమయంలో వినియోగించే ప్రత్యేక సెలైన్ కూడా ఆస్పత్రిలో లేదని సమాచారం. నిలిచిపోయిన కంటి శస్త్ర చికిత్సలు మళ్లీ చేయాలంటే మందులు చాలా అవసరం. దీనిపై ఆస్పత్రి వర్గాలు పలుమార్లు జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మందులు సరఫరాచేయాలని పేదలు కోరుతున్నారు.

మందులు లేవన్నారు

గత ఏడాది ఎడమ కంటికి శస్త్ర చికత్స చేయించుకున్నాను. కుడి కంటికి ఈ ఏడాది మార్చి మొదటి వారంలో చేస్తామన్నారు. అప్పటి నుంచి ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నా. మందులు లేవని, ఏప్రిల్‌లో చేస్తామని చెబుతున్నారు. బయట చేయించుకోవాలంటే రూ.40 వేలు అవుతుందట. అంత పెట్టుకోలేక ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్నాం.

– రమణమ్మ, రాణిపేట, గూడూరు

ఏప్రిల్ నుంచి ఆపరేషన్లు చేస్తాం

ఏరియా ఆస్పత్రిలో ఎంతో మందికి కంటి వెలుగులు అందించాం. ప్రస్తుతం మందుల కొరత ఉన్న మాట వాస్తవం. దీంతో రెండు నెలలుగా ఆపరేషన్లు చేయడం లేదు. మందుల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చాం. త్వరలో మందులు అందజేస్తామని అధికారులు తెలిపారు. మందులు వచ్చిన వెంటనే ఆపరేషన్లు చేస్తాం.

– డాక్టర్ హెలెన్, కంటి వైద్య నిపుణులు, ఏరియా ఆస్పత్రి

జన్ ఔషధ్ ద్వారా మందులు తీసుకోవాలన్నారు

జన్ ఔషధ్ ద్వారా కంటి శస్త్ర చికిత్సలకు అవసరమైన మందులు కొనుగోలు చేయాలని ఆదేశాలు వచ్చాయి. అవసరమైన మందుల కోసం ఇండెంట్ పెట్టాం. నిధులు మంజూరయ్యాయి. మందులు వచ్చిన వెంటనే ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు చేయిస్తాం. ఈ లోగా ఆపరేషన్ గదులు, రోగులు ఉండేందుకు పడకలు సిద్ధం చేయిస్తాం.

– డాక్టర్ షరీనా, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

సైదాపురం: మండలంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఏవో హైమవతి పరిశీలించారు. గిద్దలూరులో ధాన్యం నిల్వలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం తేమ శాతంలో మినహాయింపు ఇచ్చిందన్నారు. ధర ఎక్కడ ఎక్కువగా ఉంటే అక్కడే ధాన్యం విక్రయించుకోవచ్చని పేర్కొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడండి

సైదాపురం : వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆయన శనివారం గిద్దలూరు, తురిమెర్ల సచివాలయాలను తనిఖీ చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వేలను వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే కొత్త బోర్లు వేయాలని సూచించారు. కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పీ4 సర్వే పోస్టర్ల ఆవిష్కరణ

సైదాపురం: పీ4 సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ ఆదేశించారు. ఆయన శనివారం ఏవో మురళీకృష్ణ, ఈవోపీఆర్డీ రాఘవేంద్రతో కలిసి సర్వే పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వివిధ రకాల సర్వేల వేగవంతం చేసి మండలాన్ని ప్రగతి పథంలో నిలపాలన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

పెళ్లకూరు: ప్రవాసాంధ్రుల సాయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సర్పంచ్ దేవారెడ్డి నాగేంద్ర రెడ్డి తెలిపారు. బంగారంపేట గ్రామ సచివాలయంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐలు, సంపన్నులు ముందుకు వచ్చి మౌలిక వసతుల కల్పనకు సహకారం అందించాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీరు వృథా కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వేసవి తాపానికి మూగజీవాల దాహార్తి కోసం చెరువులో నీటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ కిశోర్, రాజేష్, మోహనకుమారి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం


తనియాలి వాసులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో రవీంద్రబాబు

దొరవారిసత్రం : పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీవో రవీంద్రబాబు తెలిపారు. ఆయన శనివారం తనియాలి సచివాలయాన్ని పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు రామయ్య, మధు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి


ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ శివశంకర్

దక్కిలి: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎస్ఐ శివశంకర్ తెలిపారు. ఆయన శనివారం దక్కిలిలో ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. ఆటో డ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించాలని, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. వాహనం ధ్రువీకరణ పత్రాలు లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. కమ్మపల్లి రోడ్డు, దేవునివెల్లంపల్లి రోడ్డులో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని, అలా చేయవద్దని సూచించారు.

హ్యూమన్‌రైట్స్ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీగా సురేష్

వెంకటగిరి రూరల్ : ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ తిరుపతి జిల్లా జనరల్ సెక్రటరీగా నారిపాల్ సురేష్‌బాబు ఎంపికయ్యారు. ఆయన మాట్లాడు తూ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కె శ్రీనివాసులు తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

విజయవాడ నుంచి హజ్ యాత్రను కొనసాగించాలి

చిల్లకూరు : ముస్లింలు విజయవాడ నుంచే హజ్ యాత్రను కొనసాగించాలని వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మగ్దూమ్ మొహీద్దీన్ కోరారు. ఆయన శనివారం గూడూరు లో విలేకరులతో మాట్లాడారు. గతంలో రాష్ట్రానికి చెందిన ముస్లింలు హజ్ యాత్రకు బెంగళూరు, హైదరాబాద్‌కు వెళ్లి అక్కడి నుంచి విమానంలో వెళ్లాల్సి వచ్చేదన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్లేందుకు వీలు కల్పించారని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విజయవాడను రద్దు చేయడం వల్ల ఇబ్బందులు తలెత్తాయని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం స్పందించి విజయవాడ నుంచి హజ్‌యాత్రకు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ


ప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కిలివేటి, ఎంపీపీ అల్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని కోటపోలూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఎన్.వీ ప్రసాద్‌రెడ్డి సతీమణి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గ్రామానికి చేరుకుని ప్రసాద్‌రెడ్డిని పరామర్శించారు. అలాగే సూళ్లూరుపేటలో ఉంటున్న హెచ్‌ఎం సరళ భర్త అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ అల్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి, బద్దెపూడి మోహన్‌కృష్ణారెడ్డి, కౌన్సిలర్ మీజూరు రామకృష్ణారెడ్డి, వేలూరు మల్లికార్జున్‌రెడ్డి, పుల్లారెడ్డి, మన్నేముత్తేరి సర్పంచ్ చిన్నరాజ, ముచ్చకాల సుదీప్, మొద్దు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


నాయకులతో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

మృతుల కుటుంబాలకు పరామర్శ

చిట్టమూరు : చిట్టమూరు వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బద్దిగ వెంకటరమణయ్య, మెట్టు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత జనార్దన్‌రెడ్డిని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ శనివారం పరామర్శించారు. బీవీ రమణయ్య సోదరుడు శివప్రసాద్ రావు ఇటీవల మృతి చెందారు. ఎమ్మెల్సీ చిట్టమూరుకు చేరుకుని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మెట్టు గ్రామానికి చెందిన అంబటి జనార్దన్ రెడ్డి తండ్రి, మాజీ మునసబ్ చంద్రశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ చిట్టమూరు, కోట మండలాల అధ్యక్షులు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పలగాటి సంపత్ కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పేట రాజీవ్‌రామిరెడ్డి పాల్గొన్నారు.

కవర్లతో నాణ్యమైన మామిడి కాయలు

దక్కిలి: నాణ్యమైన మామిడి కాయలు పొందాలంటే కవర్లు తొడగాలని వెంకటగిరి ఉద్యానశాఖ అధికారి ఆనంద్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం తీర్థంపాడు, దేవులపల్లి తదితర గ్రామాల్లోని మామిడి తోటలను పరిశీలించారు. కాయలను రక్షించుకోవడానికి కవర్లు తొడిగే విధానంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మామిడిలో టేబుల్ రకాలైన బేనిషా, మల్లిక, రసాలు, పెద్ద నీలం, నీలం, ఖాదర్, హిమాం పసంద, కలర్ తోతాపురి రకాలకు వైట్ కవర్లు కడితే కాయలు పెద్దవిగా అవుతాయన్నారు. మంగు, ఎంక పురుగు, ముడ్డి పుచ్చు పురుగు, పండు ఈగ, తెగుళ్లు, ఎండ తీవ్రత, వడగండ్ల వాన నుంచి కాయలను కాపాడుకోవచ్చని చెప్పారు. ధర కూడా ఎక్కువగా వస్తుందన్నారు. కాయ కోడిగుడ్డు పరిణామంలో ఉన్నప్పుడు కవర్ కట్టాలన్నారు. 50 రోజుల తరువాత కాయలను కోయాల్సి ఉంటుందన్నారు. రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఎకరాకు రూ.4 వేలు, గరిష్టంగా 2.5 ఎకరాలకు రూ.10 వేల రాయితీ ఇస్తుందని తెలిపారు.


కవర్లు కట్టిన మామిడి కాయలు

శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం సాయంత్రం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను అలంకార మండపంలోకి వేంచేపు చేసి విశేషంగా అలంకరించారు. అనంతరం తిరుచ్చిపై కొలువుదీర్చారు. తదుపరి సహస్ర దీపాలంకరణ మండపానికి తరలించి ఊంజల్ సేవ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.


స్వామి, అమ్మవార్లను ఊంజల్ సేవ మండపానికి తీసుకువస్తున్న అర్చకులు

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

చిల్లకూరు : తూర్పుకనుపూరులో ముత్యాలమ్మ అలయ అనుబంధంగా నిర్వహించే పోలేరమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఏఎస్పీ రవిమనోహరాచారి తెలిపారు. ఆయన శనివారం జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముత్యాలమ్మ ఆలయానికి అనుబంధంగా నిర్వహించే పోలేరమ్మ జాతరకు ప్రతి ఏటా కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణా, తమిళనాడు ప్రాంతాల నుంచి సుమారు 5 లక్షల మందికి పైగా భక్తులు వస్తారని తెలిపారు. అందుకనుగుణంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. మద్యం, డబ్బా ఆటలు, జూదంపై ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు. గూడూరు, నాయుడుపేట డీఎస్పీలు గీతాకుమారి, చెంచుబాబు, వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, చిల్లకూరు ఎస్ఐ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ రవిమనోహరాచారి

రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

వాకాడు : ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.ప్రసాద్ రావు తెలిపారు. ఆయన శనివారం నిడిగుర్తి, వాకాడు సచివాలయాల పరిధిలో రైతుల విశిష్ట గుర్తింపు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని చోట్లా 80 శాతం మంది రైతుల విశిష్ట గుర్తింపు నమోదు పూర్తి చేశామన్నారు. వాకాడు మండలంలో 58 శాతం మాత్రమే అయిందన్నారు. ఈ నెలాఖరు లోపు ప్రతి గ్రామంలోనూ 80 శాతం నమోదు పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ సహాయ అధికారి ధనుంజయరెడ్డి, టెక్నికల్ అధికారిణి హరిత, నాయుడుపేట ఏడీ సుచీంద్రప్రసాద్, ఏవో దీప పాల్గొన్నారు.


వివరాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు

నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

సూళ్లూరుపేట : నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని పులికాట్ వన్యప్రాణి విభాగం రేంజర్ టి.నరసింహారావు పిలుపునిచ్చారు. సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నీటి కాలుష్యం, నీటి సంరక్షణపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా టి.నరసింహారావు పాల్గొన్నారు. ఆయన మంచి నీటి వనరులు, నీటి కాలుష్యంపై పవర్‌పాయింట్ ప్రదర్శన ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ, వైస్ ప్రిన్సిపాల్ పి.విక్టోరియారాణి, అధ్యాపకులు ఎస్.శ్రీనివాస్, డి.నాగభూషణం, జె.సుబ్రమణ్యం, శరత్‌బాబు, పి.ఏడుకొండలు, బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యం

రాపూరు: క్షయవ్యాధిని నిర్మూలించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వేపినాపి పీహెచ్‌సీ వైద్యులు ప్రమీలారాజకుమారి తెలిపారు. వేపినాపిలో శనివారం క్షయవ్యాధిపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వారం కంటే ఎక్కువ రోజులు దగ్గు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. క్షయను ముందుగానే గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. వ్యాధి గ్రస్తులకు ఉచితంగా మందు లు అందజేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం ప్రసూన, సీహెచ్‌వో నజీమున్నీసా, టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

దక్కిలి: పేదలకు సేవలు అందించడం అభినందనీయమని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ తెలిపారు. మౌనిక చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వెలికల్లులో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నీటిని వృథా చేయవద్దని సూచించారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ట్రస్ట్ నిర్వాహకులకు సూచించారు. తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు, ట్రస్ట్ నిర్వాహకులు మౌనికారెడ్డి, జంపాల ప్రకాష్, వీఆర్వో రాంమోహన్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం

నాయుడుపేట టౌన్ : విద్యుత్ సమస్యలకు సత్వరం పరిష్కారం చూపుతున్నట్లు ఏపీ ఎస్‌పీడీసీఎల్ ఈఈ శ్రీనివాసులు తెలిపారు. జువ్వలపాళెం విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహ వినియోగదారులకు రాత్రిళ్లు కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వేసవిని దృష్టి లో ఉంచుకుని నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి విద్యుత్ సబ్ డివిజన్లలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ల వద్ద సదస్సులు నిర్వహించి సమస్యలు తెలుసుకుంటున్నట్లు వివరించారు. ఏఈ శివశంకర పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నాయుడుపేట టౌన్ : తుమ్మూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల వల్ల ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ శివశంకర్ తెలిపారు. దీంతో తుమ్మూరు, చంద్రబాబు కాలనీ, పాత రెవెన్యూ కార్యాలయం, భరత్ నగర్, ఎన్ఎస్ఆర్ కాలనీ, మంగపతినాయుడు నగర్, బేరిపేట, ఆర్ముగం నగర్, ప్రభుత్వ వైద్యశాల వీధి, దర్గా వీధి, రాజగోపాలపురం, శ్రీరామ్ నగర్, అశోక్ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

ఉగాది పురస్కారానికి తడ ఏఎస్ఐ ఎంపిక

సూళ్లూరుపేట : తడ పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న పి.శ్రీకుమార్‌రెడ్డి ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. ఆయనను సూళ్లూరుపేట సర్కిల్ విభాగం పోలీసు అధికారులు అభినందించారు.

మహిళ ఆత్మహత్య

వెంకటగిరి రూరల్: తెలుగుగంగ కాలువలో దూకి మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం మృతదేహం లభ్యమైంది. మృతురాలు వెంకటగిరిలోని ఏనుగులపాళెంకు చెందిన నాగమణి(30)గా పోలీసులు గుర్తించారు. ఆమె ఏనుగలపాళెంలో ఒంటగిరిగా ఉంటోంది. శుక్రవారం మధ్యాహ్నం బంధువులకి ఫోన్ చేసి తాను చనిపోతున్నట్లు చెప్పింది. బంధువులు గాలించగా శనివారం ఉదయం జంగాలపల్లి తెలుగంగ కాలువలో శవమై తేలింది. అప్పుల బాధతోనే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిసింది. ఎస్ఐ సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివామి దగ్ధం

చిట్టమూరు : కోగిలి పంచాయతీ సోమసముద్రం దళితవాడలో శనివారం గడ్డివామి దగ్ధమైంది. ఈదూరు నాగరాజు గడ్డిని వామి వేసుకున్నాడు. శనివారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది చుట్టు పక్కల ఉన్న వాములకు మంటలు అంటుకోకుండా అదుపు చేశారు. సుమారు రూ.లక్ష నష్టం సంభవించినట్టు బాధితుడు తెలిపారు.

నేడు వెంకటగిరికి నేదురుమల్లి రాక

వెంకటగిరి(సైదాపురం) : వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదివారం వెంకటగిరికి రానున్నారని ఆ పార్టీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతారని తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

తడ: ఏపీ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సౌజన్య తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు ఉన్నాయ ని తెలిపారు. మే 22 వరకు గడువు ఉందన్నారు. వివరాలకు 99481 46677, 94906 97556లో సంప్రదించాలని సూచించారు.

కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్ ప్రవేశాలు

తడలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 2025–26లో ఇంటర్, 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజమ్మ తెలిపారు. మార్చి 22 నుంచి ఏప్రిల్ 11 వరకు గడువు ఉందన్నారు. అలాగే 7, 8, 9, 10 తరగతుల్లో మిగులు సీట్లను భర్తీ చేస్తున్నామని, అర్హులైన బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 93462 44478లో సంప్రదించాలన్నారు.

అత్తివరంలో పీ-4 గ్రామసభ

ఓజిలి: గ్రామీణ ప్రాంతాల్లో పేదలను గుర్తించి ఆర్థికంగా ఉన్న వారి నుంచి సహాయం చేయాలన్నదే పీ-4 గ్రామసభల ఉద్దేశమని ఈవోపీఆర్డీ రేణుక తెలిపారు. మండలంలోని అత్తివరం సచివాలయంలో శనివారం పీ-4 గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బీపీఎల్ కింద వున్న పేదలను గుర్తించాలన్నారు. వారిని ఆర్థికంగా ఉన్న వారు ఆదుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫారంపాండ్‌కు భూమి పూజ

చిల్లకూరు: ఉపాధి హామీ పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతోందని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం కమ్మవారిపాళెంలోని ఒక రైతు పొలంలో ఉపాధి హామీ కింద ఫారంపాండ్ పనులకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పేద రైతుల పొలాల్లో ఫారంపాండ్ తవ్విస్తున్నట్టు తెలిపారు. తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని, పంటల సాగుకు వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు

పెళ్లకూరు: ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడం వల్ల పేదలు పట్టణాలకు వలస వెళ్లకుండా అర్హులందరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నట్టు ఏపీవో దయానంద్ తెలిపారు. ఆయన శనివారం ముమ్మారెడ్డిగుంట, కలవకూరు గ్రామాల్లో ఫారం పాండ్స్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చడంతో పాటు భూగర్భ జలాలు పెంపొందించడానికి ఫారంపాండ్స్ ఉపయోగపడతాయని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో పని ప్రదేశంలో టార్పాలిన్ పట్టలతో నీడ ఏర్పాటు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉండేలా క్షేత్ర సహాయకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

శ్మశానభూమి ఆక్రమణపై నిరసన

కోట: శ్మశాన భూమి ఆక్రమించుకుని రొయ్యల చెరువు ఏర్పాటుచేశారని చీకట్లదిబ్బ గ్రామస్తులు వాపోయారు. వారు శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన శ్మశానానికి గతంలో రెండెకరాల భూమిని కేటాయించినట్టు తెలిపారు. కొందరు ఆ భూమిని ఆక్రమించుకుని రొయ్యల చెరువు తవ్వారని వాపోయారు. పొలాల్లోకి వెళ్లేందుకు వీలులేకుండా దారిని సైతం ఆక్రమించి కట్టలు కట్టారని తెలిపారు. శ్మశాన భూమిని సర్వే చేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జయజయరావుకు వినతి పత్రం అందజేశారు.


నిరసన తెలుపుతున్న చీకట్లదిబ్బ గ్రామస్తులు

సాక్షి ఎఫెక్ట్..

ఇసుక రీచ్ మూసివేత

కలువాయి(సైదాపురం): కలువాయి మండలం కుల్లూరు మజరా రాజుపాళెం వద్ద అనధికారికంగా పెన్నాలో నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌ను రెవెన్యూ అధికారులు మూసివేశారు. కుల్లూరు పెయ్యాల తిప్ప నుంచి మట్టి తరలిస్తున్న వాహనాలను కూటమి నాయకుల ఫోన్ కాల్‌తో వీఆర్వో వదిలేశారు. దీనిపై మన బండ్లే వదిలెయ్ అన్న శీర్షికన సాక్షి దిన పత్రికలో శనివారం కథనం ప్రచురితమైంది. దీనిపై ఆత్మకూరు ఆర్డీవో పావని స్పందించారు. కలువాయి తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల్లూరు రాజుపాళెం ఇసుక రీచ్‌ను మూసివేసి బోర్డు ఏర్పాటు చేయాలని వీఆర్వో రమణయ్యను తహసీల్దార్ ఆదేశించారు. వీఆర్వో అక్కడికి చేరుకుని ఇసుక రీచ్‌ను మూసివేశారు.

బోరు తొలగింపునకు చర్యలు

చిట్టమూరు : మండలంలోని ఆరూరు సమీపంలోని పొలాల్లో రొయ్యల చెరువు కోసం వేసిన ఉప్పు నీటి బోరును తహసీల్దార్ కాయల సతీష్ కుమార్ శనివారం పరిశీలించారు. పచ్చని పైరు ఉప్పు మయం అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో కొద్దిజుల క్రితం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తహసీల్దార్ సర్వేయర్‌తో కలిసి శనివారం ఉప్పు నీటి బోరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వాల్టా చట్టం ప్రకారం ఒక బోరుకు మరొక బోరు మధ్య సుమారు 250 మీటర్లు దూరం ఉండాలన్నారు. ఉప్పునీటి బోరు 250 మీటర్ల లోపలే ఉందన్నారు. విద్యుత్ శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులకు తెలియజేసి ఉప్పునీటి బోరును నిలుపుదల చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. వీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

విధుల నుంచి బిల్ కలెక్టర్ తొలగింపు

నాయుడుపేట టౌన్ : మున్సిపాలిటీ దుకాణాల అద్దెను కార్యాలయంలో జమ చేయని బిల్ కలెక్టర్ పళ్లెం రమేష్‌ను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు కమిషనర్ షేక్ ఫజులుల్లా శనివారం తెలిపారు. పట్టణంలోని నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి షాపింక్ కాంప్లెక్స్‌లో 17, 24 దుకాణాల అద్దె రూ.96 వేలను రమేష్ వసూలు చేశాడు. ఆ మొత్తాన్ని కార్యాలయంలో జమ చేయలేదు. దీనిపై లీజుదారులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రమేష్‌ను విధుల నుంచి తొలగించారు. విచారణచేసి నివేదిక ఇవ్వాలని సీనియర్ సహాయకుడు ఎం.ఉపేంద్ర ధీరజ్‌ను ఆదేశించారు. తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అతనిపై చర్యలు తీసుకుంటామన్నారు.